www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 22 మార్చి 2024



నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల స్పాట్ వాల్యూయేషన్‌లో భాగంగా ఈనెల 22న రోజున ఫిజిక్స్, ఎకనామిక్స్ పత్రాలను అధ్యాపకులు దిద్దుతారని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఆయా జూనియర్ కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో ఉన్నాయి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్స్ వాటిని డౌన్‌లోడ్ చేసుకుని తమ లెక్చరర్లను రిలీవ్ చేసి, మూల్యాంకనకు ఉదయం 10 గంటలకు హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. స్పాట్ వాల్యుయేషన్ అపాయింట్మెంట్ ఆర్డర్స్ పొందిన అధ్యాపకులు మూల్యాంకనానికి హాజరు అయ్యేలా చూడడం కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యం బాధ్యతని తెలిపారు. హాజరుకాని ప్రతి అధ్యాపకునికి రోజుకు రూ. వెయ్యి చొప్పున ప్రిన్సిపల్, యాజమాన్యాలపై జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

కడప ఎంపీ బరిలో షర్మిల!?



కడప పార్లమెంట్ బరిలో వైఎస్ షర్మిల నిలిచే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 25న తొలి విడత టికెట్ల విడుదల నాటికి స్పష్టత రానుంది. కాంగ్రెస్ అధిష్టానం సైతం ఆదేశించినట్లు సమాచారం. షర్మిల సంసిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈమె పోటీ చేయనుండడంతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా నిలిచిన మైనార్టీలు వైసిపి మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. రెండు నెలల కిందటి నుంచి పలువురు ముస్లిమ్ ప్రముఖులు వైసిపి, టిడిపి, జనసేన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులకు ఓట్లు వేస్తే బిజెపికి వేసినట్లే అవుతోందని, ఇండియా బ్లాక్‌కు ఓట్లేస్తే ఓటింగ్ శాతం పెరగడం ద్వారా అధికార, ప్రతిపక్ష పార్టీలకు కనువిప్పు కలిగించినట్లు అవుతుందనే ఉద్దేశంతో చాపకింద నీరులా పనిచేస్తున్నారు.

- మూడ్రోజుల్లో స్పష్టతకు అవకాశం
- వైసిపి, టిడిపిలో అలజడి
- మైనార్టీ ఓట్లపై ఆశలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

కడప పార్లమెంట్ ఎన్నిక ఉత్కంఠను కలిగిస్తోంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీల పరిధిలో 16.16 లక్షల ఓటర్లు ఉన్నారు. వీరి ఓట్లను గణనీయమైన సంఖ్యలో కైవసం చేసుకునేందుకు అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థుల పోరాటం ఆసక్తికరంగా మారింది. అధికార వైసిపి సిట్టింగ్ ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. ప్రతిపక్ష టిడిపి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై నిమగ్నమైంది. కాంగ్రెస్ తరుపున షర్మిల నిలవనుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. కేంద్రంలో బిజెపి సర్కారు సిఎఎ గైడ్ లెన్స్ అమలు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఓటు బ్యాంకును రాబట్టుకోవడంపై దృష్టి సారించింది. ముస్లిమ్‌లు, క్రిస్టియన్ల ఓట్లపై వల వేసినట్లు కనిపిస్తోంది. సంప్రదాయ కాంగ్రెస్ ఓట్లు, మైనార్టీ ఓట్లలో చీలిక ద్వారా ఓటు శాతాన్ని గణనీయంగా పెంచుకోవడంపై దృష్టి సారించింది.

సానుభూతి ఓట్లపై కన్ను!

మాజీ మంత్రి వైఎస్ వివేకా అభిమానుల సానుభూతి ఓటర్ల ప్రభావం చూపే అవకాశం ఉంది. వైఎస్ వివేకా వర్ధంతి సభకు హాజరైన నేతలు, అభిమానులు బలం చేకూరుస్తోంది. వివేకా హత్య ఘటనపై ముఖ్యమంత్రి హోదాలో ఉన్న సహోదరుడు వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించడం, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై సెంటిమెంట్ రాజేయడం, ఆమె సోదరి సునీత హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న వైసిపికి ఓట్లేయొద్దని విజ్ఞప్తులు చేసిన నేపథ్యం పార్లమెంట్ ఎన్నిక ఉత్కంఠను కలిగిస్తోంది. వివేకా కుటుంబం సైతం తన వెంట నిలబడి ప్రచారం చేయనున్న నేపథ్యంలో వైసిపి నుంచి సానుభూతి ఓట్లను కొల్లగొట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

మైనార్టీ ఓట్ల చీలికపై ఆశలు!

జిల్లాలో మైనార్టీ ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. కడప అసెంబ్లీలో 90 వేలు, కమలాపురంలో 75 వేలు, మైదుకూరులో 30 వేలు, ప్రొద్దుటూరులో 55 వేలు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలులో 30 వేలు చొప్పున ముస్లిమ్ ఓటర్లు ఉన్నట్లు ఓ అంచనా. గణనీయమైన సంఖ్యలో క్రిస్టియన్ల ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ బరిలో షర్మిల నిలబడితే ముస్లిమ్, క్రిస్టియన్ ఓటర్లపై ఆశలు పెంచుకున్నట్లు కనిపిస్తోంది. రెండు శాతం నుంచి నాలుగు శాతంపైగా ఓట్లు చీలితే వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల తలరాతలు మారే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనప్పటికీ పదేళ్ల కిందటి తరహా రాజకీయ వాతావరణం నెలకొనే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

దోచుకోవడమే వైసిపి నేతల నైజం

- 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి



పోరుమామిళ్లలో మాట్లాడుతున్న భువనేశ్వరి, అక్కమ్మ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తూ..

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

వైసిపి ప్రభుత్వంలో ఎక్కడ ఏమి కనిపించినా దోచుకోవడం, దాచుకోవడమే ఆ పార్టీ నాయకుల నైజమని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల గ్రామంలో పార్టీ కార్యకర్త మెహబూబ్‌చాంద్, బలిజకోటలో మునెల్లి అక్కమ్మ కుటుంబాలను నారా భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక వారు గుండెపోటుతో మృతి చెందారు. వారి చిత్రపటాలకు ఆమె నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయం కింద చెక్కులు అందజేశారు. పరామర్శల అనంతరం పోరుమామిళ్ల ప్రజలతో భువనేశ్వరి మాట్లాడుతూ ప్రతి రోజూ మీ పొలాలు, స్థలాలు ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. వైసిపి నేతలకు ఏది కనిపించినా దోసేస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన మొత్తం దోపిడీల పర్వంగా కొనసాగిందే తప్ప, సామాన్యులకు లాభకరమైన పనులేవీ వైసిపి ప్రభుత్వం చేయలేదని పేర్కొన్నారు. వైసిపి పాలనలో కల్తీమద్యం, ఇసుక దోపిడీ, భూ కబ్జాలు, గంజాయి, డ్రగ్స్, మహిళలపై దాడుల్లో ఎపిని భారతదేశంలో జగన్మోహన్‌రెడ్డి మొదటి స్థానంలో నిలబెట్టారన్నారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రస్థానంలో ఎపిని నిలబెట్టారని తెలిపారు. వైసిపి పాలనలో టిడిపి ప్రభుత్వం తెచ్చిన కంపెనీలన్నీ ప్రక్కనున్న రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. ఎపికి రాజధాని లేకుండా చేసి రాష్ట్రం పరువు తీశారన్నారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఎన్నికలని తెలిపారు. దీనికి ప్రతి కార్యకర్త, నాయకుడు సంసిద్ధంగా ఉండాలన్నారు. వైసిపి చేసే అరాచకాలను ధైర్యంగా తిప్పికొట్టి, 2024 ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో దుర్మార్గుల పాలనను అంతం చేయాలని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు, భావితరాల భవిష్యత్తు బాగుంటుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తారని తెలిపారు. సంక్షేమంతో పాటు భవిష్యత్తుకు కూడా గ్యారంటీ ఉంటుందనే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కడప టిడిపి అభ్యర్థి మాధవి, యువ నాయకులు రితీష్‌రెడ్డి పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడవద్దు

రైల్వేకోడూరు: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అక్రమ కేసులకు భయపడవద్దని కార్యకర్తలకు అండగా ఉంటామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి బద్వేల్‌కు వెళుతూ మార్గమధ్యలో పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు, మాచినేని విశ్వేశ్వర నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులను కలిశారు. ముక్కావారిపల్లె వద్ద టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపనందరెడ్డి, ఆయన సతీమణి వరలక్ష్మి భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. రూపానందరెడ్డి ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి 53 రోజులు జైలులో ఉంచారని తెలిపారు. అక్రమ అరెస్టును జీర్ణించుకోలేని కార్యకర్తలు తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెందాలని చెప్పారు. అలాంటి వారి కుటుంబాలను తాను పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పిస్తున్నానన్నారు. అనంతరం రూపానందరెడ్డి నివాసంలో భువనేశ్వరి బృందానికి భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కెకె.చౌదరి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** నారా భువనేశ్వరికి వెంకటరాజంపేట వద్ద టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట ఇన్‌ఛార్జి బత్యాల చెంగల రాయుడు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిఇఒ అనురాధకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-కడపఅర్బన్

పదవ తరగతి మూల్యాంకన విధులలో పాల్గొనే ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించాలని గురువారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఇఒ ఎం.అనురాధకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ం జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి మూల్యాంకన విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు తగిన మినహాయింపులను, సౌకర్యాలను కల్పించుటకు తగు చర్యలు తీసుకోవాలనని విజ్ఞప్తి చేశారు. 58 సంవత్సరాల వయస్సు దాటిన ఉపాధ్యాయులకు, గర్భిణులకు, చిన్నపిల్లల తల్లులకు, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా మూల్యాంకన కేంద్రంలో వసతి సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని, మూల్యాంకన కేంద్రంలో తగినన్ని ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో వైద్య సిబ్బంది ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సకాలంలో రెమ్యూనరేషన్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది మూల్యాంకన విధులు నిర్వహించిన కొంతమంది ఉపాధ్యాయులకు ఇప్పటికి కూడా పూర్తిస్థాయిలో రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. అప్పటి రెమ్యునరేషన్ కూడా చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ చేసిన వినతికి డిఇఒ సానుకూలంగా స్పందించారు. మూల్యాంకన కేంద్రంలో తగు సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత రెమ్యునరేషన్ చెల్లింపునకు కూడా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు జి.గోపీనాథ్, చింతకొమ్మదిన్నె మండలం ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్, వై.సురేష్ పాల్గొన్నారు.

ట్రిపుల్ఐటి డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇడుపులపాయ ట్రిపుల్ఐటిలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న డైరెక్టర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పట్టభద్రుల ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత అటెండర్, సెక్యూరిటీ గార్డ్, హౌస్ కీపింగ్ పోస్టులకు భర్తీ చేశారని పేర్కొన్నారు. కోడ్ అమలులోకి వచ్చినా ముందు తేదీ వేసి అందరికీ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తాను డైరెక్టర్‌కు ఫోన్‌చేస్తే ఎంపీ అవినాష్‌రెడ్డి వీటిని భర్తీ చేశారని సమాధానం ఇచ్చారని చెప్పారు. కోడ్ వచ్చిన తరువాత పోస్టులను భర్తీ చేయడమంటే రాజకీయ పార్టీకి లబ్ధిచేకూర్చడమేనన్నారు. డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగిగా కాకుండా వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే విచారణ చేపట్టి అధికారపార్టీ కనుసన్నల్లో జరిగిన నియామకాలను రద్దు చేయాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ముగిసే వరకు ఇక్కడ విధులు నిర్వహించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ప్రచార కార్యదర్శి జనార్థన్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చెన్నూరు

త్వరలో నిర్వహించబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ప్రశాంతంగా స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని సిఐ పార్థసారథి అన్నారు, గురువారం ఉదయం మండలంలోని రాచినాయపల్లె, రామనపల్లె గ్రామపంచాయతీ, చెన్నూరు తూర్పు హరిజనవాడలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు సమస్యాత్మకమైన గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించామని తెలిపారు. పచ్చని గ్రామాలలో ఎలాంటి సమస్యలు పెట్టుకోకుండా అందరూ కలసి మెలసి అన్నదమ్ముల వల్లే ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని గ్రామ ప్రజలకు సూచించారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివయ్య, రామిరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసిసిని ఉల్లంఘిస్తే కేసులు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎలక్షన్ సెల్ అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్డ్ తుపాకులను వెంటనే డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా, 2024 ఎన్నికల నేపథ్యంలో నమోదైన నేరాల దర్యాప్తు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. నేరస్థులకు సాక్ష్యాధారాలతో శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల సంబంధిత కేసుల్లో దర్యాప్తు నైపుణ్యత పెంపొందించుకుని వేగవంతంగా విచారణ జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఎక్కడా చిన్న ఘటనకు తావు ఇవ్వకూడదని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి వెంకట రాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్.సుధాకర్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు డిఎస్‌పిలు మురళీధర్, టి.డి యశ్వంత్, వినోద్ కుమార్, వెంకటేశ్వర్లు, డిటిసి డిఎస్‌పి రవి కుమార్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్లు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి మాధవికి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన కడప నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవికి గురువారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కడప రెవెన్యూ డివిజన్ అధికారి, రిటర్నింగ్ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం ఆమె ఫేస్ బుక్ సోషల్ మీడియాలో ఎంసిసిని ఉల్లంఘిస్తూ అభ్యంతరకరమైన పోస్టును విడుదల చేయడంపై షోకాజ్ నోటీసును జారీ చేశామని తెలిపారు. నోటీసును జారీ చేసిన వెంటనే ఆమె తన పోస్టును ఫేస్ బుక్ నుంచి తొలగించారని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలు -2024కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 16న షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురండి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ గురువారం కడప నగరంలోని ఆజాద్ నగర్‌లో ఉన్న బృందా వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అక్కడ ఉన్న వృద్ధులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వసతి సదుపాయాలను ఈ సందర్భంగా జడ్జి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011 ను వివరించారు. సీనియర్ సిటిజన్స్ టోల్ ఫ్రీ నెంబర్: 14567 ద్వారా ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

దరఖాస్తు స్వీకరణ గడువు పెంపు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఏప్రిల్‌లో నిర్వహించ తలపెట్టిన స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ,పి.హెచ్‌డి పట్టాలు పొందడానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 21 నుంచి 30 వరకు పొడిగించినట్లు విశ్వ విద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటిదాకా వివిధ డిగ్రీల పట్టాల కోసం 8,898 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం



ఇంజినీరింగ్ అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో లభ్యతపై కార్పొరేషన్ కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ నగర పాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీరింగ్ విభాగ అధికారులు, నగరపాలక ఫిట్టర్లు, హెడ్ వర్కర్స్‌తో సమావేశ ఏర్పాటు చేశారు. నగరంలో నీటి సరఫరా పట్టికలను జోన్ వారిగా రిశీలించారు. నీటి సరఫరా వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలియజేసేలా తగిన ప్రణాళికలను తీసుకురావాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. నాలుగవ జోన్ వారీగా నీటి సరఫరాకు కావాల్సిన అవసరాలను తెలుసు కున్నారు. రామరాజుపల్లి బండి కనుమ ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్, మున్సిపల్ ఆఫీసుల నీటి ప్రవాహం వివరాలను తెలుసుకుని ప్రజలకు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. కేటాయించిన ప్రాంతాలలో నీటి సరఫరా ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అక్కడ చేయాల్సిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆదేశాలు జారీ చేశారు. నీటి సరఫరా రోజూ ఏ ప్రాంతంలో ఏ సమయానికి నీటి సరఫరా చేస్తారో ప్రజలకు తెలిసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పట్టికలను ఎప్పటికప్పుడు తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగా అధికారులకు సూచించారు. నగరంలో ఉన్నటువంటి నీటి బోర్ల మరమ్మతులను తక్షణమే చేయించాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్క డివిజన్‌లో నీటి సరఫరా రిపోర్టులను పరిశీలించారు. ఏరోతోప్స్ ఉపయోగించి నీటిని పొదుపు చేసుకునేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. నీటి సరఫరా పట్టికలను ప్రతిరోజు గూగుల్ షీట్ ద్వారా అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కంట్రోల్ రూమ్ వారికి సూచించారు. నీటిని ఎక్కడ కూడా వృథా జరగకుండా చర్య తీసుకోవాల్సిందిగా ఇంజినీరింగ్ విభాగ అధికారులు, ఫిట్టర్లకు ఆదేశించారు. నగరంలో ఉన్నటువంటి బోర్లను సమర్థవంతంగా పనిచేయు విధంగా చర్యలు తీసుకుంటూ ప్రజలకు నీటి సరఫరా చేయు విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. నీటి సరఫరా సమస్యల కోసం ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నీటి సరఫరా ఎటువంటి ఫిర్యాదు వచ్చినచో వాటిని ఆరు గంటలకు పరిష్కరించేలా అధికారులకు ఆదేశించారు.

ఎన్నికల తాయిలాలపై సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా ప్రజానీకానికి వివిధ పార్టీలు ఎన్నికల తాయిలాలు ఇస్తున్నట్లు తెలిస్తే వాణిజ్య పన్నుల శాఖకు సమాచారం ఇవ్వాలని సంయుక్త కమిషనర్ జి. కల్పన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఈనెల 16 నుంచి అమలులో ఉన్నందున వాణిజ్య పన్నుల శాఖ కంప్లైంట్స్ మానిటరింగ్ మిషనిజం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా మీ మీ ప్రాంతాలలో ఓటు కోసం ఉచిత తాయిలాలు పంచినా, పంచేందుకు సిద్ధపరచిన ప్రదేశాలు, గోదాముల గురించి సమాచారాన్ని వాట్సప్ 9154 970449 ద్వారా అందించాలని పేర్కొన్నారు.

ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే నిర్వహించారు. గురువారం డౌన్ సిండ్రోమ్ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు గుండె, రక్త పరీక్షలు చేశారు. ఆట, పాటలు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు, పీడియాట్రిక్స్ హెచ్ఒడి డాక్టర్ వంశీధర్, డాక్టర్ రమేష్, డాక్టర్ విష్ణు వందన, సిబ్బంది పాల్గొన్నారు. **అల్ షిఫా కేంద్రంలో..** తల్లిదండ్రుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ షిఫా రఫీ మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది క్రోమోజోమ్ సాధారణ పరిస్థితిలో వల్ల ఏర్పడుతుందని పేర్కొన్నారు. మానవ శరీరంలో 21 జతల క్రోమోజోములకు అదనంగా ఒక క్రోమోజోమ్ ఉంటే డౌన్ సిండ్రోమ్ పుట్టే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వీలైనంతవరకూ మేనరికపు వివాహాలకు దూరంగా ఉండవలని పేర్కొన్నారు. మానసిక దివ్యాంగ పిల్లలలో డౌన్ సిండ్రోమ్ అనే లక్షణాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డౌన్ సిండ్రోమ్ పిల్లలు, తల్లితండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుల పిల్లలతో అల్‌షిఫా రఫి

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి

ప్రజాశక్తి కడప అర్బన్



ఆర్‌జెడికి వినతి పత్రం ఇస్తున్న రూట నాయకులు

ఉర్దూ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని ఆర్‌జెడి వై. రాఘ వరెడ్డిని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అదనపు ప్రధాన కార్య దర్శి ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర కన్వీనర్ షహాబుద్దీన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముహమ్మద్ అయ్యూబ్ మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడి యంతో పాటు రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ మీడియాన్ని సమాంతరంగా నిర్వహించాలని కోరారు. ఉర్దూ మీడియం పాఠశాలల ఉనికిని తప్పక కాపాడు తామని ఆర్‌జెడి తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష పిఒ ప్రభాకర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్, జిల్లా హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

దళితుల అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్ అన్నారు. గురువారం మాసాపేటలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, ప్రశ్నించిన వారిపైన అక్రమ కేసులు బనాయిచడం, వారి ఆస్తులను కొల్ల గొట్టడం, భూములను కబ్జా చేయడం నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇందులో భాగంగా నగరం నడిబొడ్డులోని ఖలీల్ నగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే స్వర్ణ నాగయ్యకు సంబంధించిన ఐదు ఎకరాల భూమిని కబ్జా చేశారని పేర్కొన్నారు. రాష్ట్రానికి మళ్లీ నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో దళితుల అభివృద్ధికి పాటు పడతారని చెప్పారు. దళితుల భూములు వారికి చెందే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో స్వర్ణ సుబ్బరాయుడు, సుకుమార్, కమల్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్ శుక్రవారం (సా)	షహారీ శనివారం (ఉ)
6.30	5.03



మాట్లాడుతున్న నంద్యాల వరదరాజులరెడ్డి

టిడిపిలో చేరిన 200 మంది కార్యకర్తలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

మున్సిపాలిటీ పరిధిలోని 9వవార్డులో మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో రాజుపాలెం మండలం టిడిపి మాజీ అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో వైసిపి నుంచి 200మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. వార్డు ఇన్చార్జ్‌గా పనిచేసిన రఫీక్ కుటుంబ సభ్యులతోపాటు మరికొందరు టిడిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి అభ్యర్థి వరదరాజులరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి ఆహ్వానించారు. రఫీక్ మాట్లాడుతూ వైసిపి కోసం ఎంతో కష్టపడ్డానని, తగిన గౌరవం అక్కడ లేదన్నారు. కార్యక్రమంలో రాజుపాలెం మాజీ జెడ్పిటిసి తోటా మహేశ్వరరెడ్డి, 14 వార్డు మాజీ కౌన్సిలర్ టప్పా మహబూబ్ బాషా, జనసేన నాయకులు సుంకర మురళి పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండల కేంద్రమైన దువ్వూరులో శ్రీ మరకత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవరాట్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ముందుగా నూతన ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్‌గా ఆరవేటి సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య వైస్‌ప్రెసిడెంట్‌గా యాదాళ్ల రామకృష్ణ, సెక్రటరీగా దేవతి రాము, కార్యవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగం పట్టాభిరామయ్యను ఘనంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు సన్మానించారు.

నేడు 'డయల్ యువర్ డిఎం'

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల ఆర్‌టిసి డిపోలో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సమస్యలు, సూచనలు ఏవైనా ఉంటే 99592 25780కు ఫోన్ చేసి తెలపాలన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు. వాట్సాప్ ద్వారా కూడా తమ సమస్యలను మెసేజ్ రూపంలో తెలుపవచ్చన్నారు.

సోమశేఖర్ యువతకు స్ఫూర్తిదాత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాజీ మంత్రి పొన్నపురెడ్డి శివారెడ్డి తనయుడు సోమశేఖర్‌రెడ్డి యువతకు స్ఫూర్తిదాతని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. పొన్నపురెడ్డి సోమశేఖర్‌రెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పిఆర్ పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ చిన్నాన్న శివారెడ్డిలాగే రాజకీయాలను అతి చిన్న వయసులోనే చూసిన వాడని, నాటి యువతలో ఒక క్రేజ్ కలిగిన యువకెరటం అన్నారు. పొన్నపురెడ్డి శివారెడ్డి సతీమణి లక్ష్మీదేవి, రెండవ తన యుడు గిరిధర్‌రెడ్డి, సీనియర్ నేతలు మురళీధర్‌రెడ్డి, సీతారాముడు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

క్రైం కార్నర్



నిందితుడ్ని మీడియాకు చూపిస్తున్న పోలీసులు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో ఈ నెల 18న జరిగిన హత్య కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు పులివెందుల పట్టణ సిఐ శంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం సాయంత్రం పార్నపల్లి రోడ్డు సమీపంలో ఉన్న కోతి సమాధి దగ్గర నిందితుడు రెంటాల సురేష్‌బాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతనికి వైద్య పరీక్షలు చేయించి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఈనెల 18న నగరిగుట్టలో నివాసం ఉన్న రెంటాల అనురాధ కుమారుడు రెంటాల బాబును కూరలు తీసుకురాలేదని వారి ఇంటికి వెళ్లి కూరలు తీసుకురావా అంటూ క్రికెట్ బ్యాట్‌తోనూ, చేతులతో కొట్టడంతో బాలుడు మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బైకులు కాల్చిన వ్యక్తి..

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని వన్‌టౌన్ పరిధిలో మూడు బైకులను కాల్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సి భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజుపేటలోని శ్రీహరిరావు వీధిలో తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి నారపనేని చంద్రశేఖర్ ఇంటి ముందు పార్కు చేసిన హోండా డియో మోటార్ సైకిల్, టివిఎస్ ఎక్సెల్‌కు అగ్గి పెట్టారని పేర్కొన్నారు. ఇదే నాగరాజు పేటలోని అడ్వకేట్ షేక్ నజీర బాషకు చెందిన హోండా యాక్టివా వాహనానికి నిప్పు పెట్టగా స్థానికులు చూసి మంటలు ఆర్పారని చెప్పారు. దీంతో పాక్షికంగా మోటార్ సైకిల్ కాలిందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని వన్ టౌన్ ఎస్ఐలతో కలిసి పరిశీలించామని పేర్కొన్నారు. సిపిఒ అబీద్ సహకారంతో వాహనానికి నిప్పు పెట్టిన వ్యక్తిని సిసి ఫుటేజ్ ద్వారా గుర్తించామని చెప్పారు. నేరానికి పాల్పడిన వ్యక్తిని పాత బస్టాండ్‌లో పట్టుకున్నామని తెలిపారు. విచారించగా పేరు మహబూబ్ బాషా, నబికోట, రవీంద్ర నగర్, కడపలో ఉన్నట్లు తెలిసింది అన్నారు. అక్కడక్కడ హోటల్లో పనిచేస్తూ తాగుడికి బానిసై పంచర్లు వేసే సొల్యూషన్ పీల్చుతూ మత్తుకు బానిస అయ్యాడని పేర్కొన్నారు. గతంలో తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నిద్రిస్తున్న బాలుడి తల పగలగొట్టిన కేసులో ఆరు సంవత్సరాలు శిక్ష కూడా అనుభవించారని చెప్పారు. ఇలాంటి వ్యక్తులు తారాస పడితే పోలీసుల దృష్టికి ప్రజలు తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ భాస్కర్‌రెడ్డి

ధర ఉన్నా.. దిగుబడి లేదన్నా..!

పసుపు పంట నూర్పిళ్లలో రైతులు బిజీ - వర్షాభావంతో తగ్గిన దిగుబడి

ప్రజాశక్తి - చాపాడు

రైతు పచ్చ బంగారంగా పేరొందిన పసుపు పంట నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. ధరలు మాత్రం గతంలో కంటే అధికంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలో సుమారుగా రెండు వందల ఎకరాల్లో రైతులు పసుపుసాగు చేశారు. ప్రస్తుతం ఎద్దులతో, కూలీల ద్వారా దుక్కులు సాగిస్తున్నారు. చాపాడు, సీతారామపురం, చిన్నగురువలూరు, పెద్ద గురువలూరు, లక్ష్మీపేట, కేతవరం గ్రామాల పరిధిలో పసుపు నూర్పిళ్ల పనులు ప్రారంభించారు. ఎకరాకు 25 పుట్ల వరకు దిగుబడి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. ఈఏడాది తెగుళ్ల బెడద లేదని.. అయితే దిగుబడి మాత్రం తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. రూ.లక్ష వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొంటున్నారు. ఏడాది పంట కావడంతో కొనుగోలు దగ్గర నుండి సాగు, కూలీలు, ఎరువులు, మందులు కలిపి అధికంగా ఖర్చులు వస్తాయని వారు పేర్కొంటున్నారు. కేసీ కెనాల్ నీటి ఆధారంగా ఈ ఏడాది పసుపు సాగు తగ్గింది .బోరు బావులు, కుందూ నది నీటి ఆధారంగా రైతులు సాగు చేపడుతున్నారు. మైదుకూరు, దువ్వూరు మండలాల్లో రైతులు మరింత కాస్త ఆలస్యంగా దుక్కిళ్లు చేసే అవకాశాలు ఉన్నాయి. మైదుకూరు మండలంలో విత్తనం కోసం ఏప్రిల్, మే నెలల్లో దుక్కులు చేపడతామని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రైతులు దున్నిన పచ్చి పసుపు పుట్టి రూ.6వేలకు పైగా పలుకుతున్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది పసుపు ధరలు గతంలో కంటే మెరుగ్గా ఉంటాయని రైతులు, వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. వట్టి పసుపు క్వింటా రూ.10వేలకుపైగా పలుకుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



పొలంలో రాశిగా పోసిన పసుపు కొమ్ములు, పొలంలో నూర్పిడి చేస్తున్న కూలీలు

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రాణి తిరుమల్ దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రొద్దుటూరు పట్టణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థి చైతన్య సదస్సులు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బి.బ్రహ్మారెడ్డి వ్యక్తిత్వ వికాసం హక్కులు, బాధ్యతలు అనే అంశంపై విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని సూచించారు. విద్యలో అనేక అంశాలపైన కులంకుశమైన చర్చ జరగాలని అందుకు విద్యార్థులే నడుం బిగించాలన్నారు. నేడు దేశంలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందన్నారు. అసమానతలు లేని సమాజం రావాలని, కుల నిర్మూలన జరగాలన్నారు. ప్రతి ఒక్కరు తమ హక్కులను తెలుసుకొని ప్రభుత్వాలకు బాధ్యతలను తెలిపే స్థాయికి రూపాంతరం చెందాలన్నారు. విద్యార్థులు కార్పొరేట్ స్వీయ బానిసత్వంలో ఉన్నారని, అనేక రుగ్మతలతో విద్యార్థులు బాధపడుతున్నారని తెలిపారు. విద్యార్థులు నిరాశ చెందకుండా వ్యక్తిగత, సామాజిక, కుటుంబ జీవితాల్లో అనేక అంశాల్లో తనదైన శైలిలో శాస్త్రీయ భావజాలంతో ముందుకు అడుగులు వేయాలని సూచించారు. అంతరించిపోతున్న మానవతా విలువలను శాస్త్రీయ విద్య ద్వారా మాత్రమే ఏర్పాటు చేయగలమన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు..

జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బి బ్రహ్మారెడ్డి, కెవిఆర్ హాస్పిటల్ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ప్రారంభించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున రక్త దానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణ్ ఇంద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ మహేష్, జెవివి నాయకులు ఎవి రమణయ్య, శ్రీరాములు, రాంబాబు, మంజూరు బాషా, చంద్రశేఖర రావు, వీరసం వరలక్ష్మీ, కవి ఎస్పీ మహమూద్, పల్లవోలు రమణ, మెజీషియన్ హరే రామ్, జై చంద్రారెడ్డి పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన టిడిపి మండలశాఖ అధ్యక్షుడు గురివిరెడ్డి

50 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - మైలవరం

మండల పరిధిలోని గంగుల నారాయణపల్లి గ్రామంలోని చిన్న గురువయ్య, గురు మోహన్ రెడ్డి, గురుశేఖర్, నాగుశితోపాటు మరో 30 కుటుంబాలు, తొర్రివేముల గ్రామంలోని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల గురివిరెడ్డి, మల్లెల చిన్న గురివిరెడ్డితోపాటు 20 కుటుంబాలు ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ చైర్మన్ సంబటూరి ప్రసాద్‌రెడ్డి, నారపరెడి జగదీశ్వర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31న ఐడిపిఎస్‌లో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 31న చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మూడు విభాగాలలో నిర్వహించనునట్లు, ప్రతి విభాగంలో విజేతలైన వారికి నగదు బహుమతులు ఉంటాయన్నారు. సీనియర్ విభాగంలో 7,8,9 తరగతులు పాల్గొంటాయని, విజేతలకు మొదటి బహుమతి రూ.7వేలు, రెండవ బహుమతి రూ. 50వేలు, మూడవ బహుమతి రూ.3వేలు.. జూనియర్స్ విభాగంలో 4,5,6 తరగతులు ఉంటాయని, గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.1,500 అందజేస్తామని తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో 1,2,3 తరగతులు ఉంటాయని, వారికి మొదటి బహుమతి రూ.3వేలు, రెండవ బహుమతి రూ.2వేలు, మూడవ బహుమతి రూ.1,500 ఉంటుందన్నారు. పోటీలు ఉదయం 9:30కు ప్రారంభమవుతాయని, పోటీ సమయం రెండు గంటల 30 నిమిషాలు అని ఆయన వివరించారు.

'ఓటు ముద్దు.. నోటు వద్దు'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక పట్టణ పరిధిలో ప్రధాన రహదారుల వెంబడి ఎన్నికలపై ఓటర్లకు అధికారులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి 'ఓటు ముద్దు.. నోటు వద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అది అందరి బాధ్యత అన్నారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, ఎస్ఐ చిరంజీవి, మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కూడలిలో మాట్లాడుతున్న తహశీల్దార్ సౌభాగ్యలక్ష్మి

అడవులను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ గురప్ప

ప్రజాశక్తి - వేంపల్లె

అడవులను సంరక్షించే బాధ్యతను విద్యార్థులతోపాటు ప్రజలు కూడా తీసుకోవాలని, అప్పుడే అడవులు విస్తరించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ గురప్ప పేర్కొన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో అడవుల ప్రాముఖ్యత-వాటి ప్రయోజనాలపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవులు ఉండడం వల్ల అడవి జంతువులు సంరక్షణకు ఎంతో తోడ్పటునిస్తాయన్నారు. వాతవరణంలో మార్పులు సంభవించి సకాలంలో వర్షాలు కూడా కురుస్తాయని తెలిపారు. అడవుల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, వాటిని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్ చేతన్‌రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి, ఫారెస్టు అధికారులు మధు, సుబ్బరాయుడు, రెడ్డి కుమారి, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనువాసులు, సంజీవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - మైలవరం

రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు అతి పవిత్రమైందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామంలో బాషా, హుస్సేన్ పీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షను విరమించే సమయంలో ఇఫ్తార్ విందు ఇవ్వడం ముస్లింల ఐక్యతకు నిదర్శనమన్నారు. ఈ సామాజిక వర్గంలో పేదలకు మంచి పౌష్టికాహారం అందించడంలో ముందుకు వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న భూపేష్‌రెడ్డి

మెస్ ఛార్జీలను విడుదల చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమ అధికారి నరసయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌బి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ప్రచార సమయంలో సంక్షేమ వసతి గృహ విద్యా ర్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను పెంచుతామని సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీ, సంక్షేమ విద్యార్థులను గాలికి వదిలేసి తమది సంక్షేమ రాజ్యం అంటూ ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. బిల్లులు మంజూరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంక్షేమ అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న మెస్,కాస్మోటిక్స్ ఛార్జీలను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో సంక్షేమ విద్యార్థులను సంఘటితం చేసి ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎల్ జిల్లా కన్వీనర్ ఓబయ్య, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి శ్రీనాథ్, గణేష్ పాల్గొన్నారు.



అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మరింత సేవ చేసేందుకు అవకాశమివ్వండి

ప్రజాశక్తి - మైలవరం

రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మంచి జరగాలంటే రెండవసారి కూడా వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే మూల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొమ్మర నంద్యాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రతి ఒక్కరిని పలుకరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని జనానికి తెలియజేస్తూ.. తనకు రెండవసారి జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జగనన్న అవకాశం కల్పించారని, మీకు మరింత సేవ చేయడానికి ముందుకు వచ్చానని తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థి అయిన వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బడిగింజల చంద్రమౌళి, నారపరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు..



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న షబ్బీర్ వలి

ప్రజా సంక్షేమ పాలనే సిఎం జగన్ ధ్యేయం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజా సంక్షేమ పాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రామంలోని కుమ్మరవీధి, పాత బ్యాంకు వీధి, మదీనా పురంలోని అయా ప్రాంతాల్లో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం అంటూ ఇంటింటికి వైసిపి నేతలు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ వేంపల్లె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హాబీబుల్లా, వార్డు మెంబరు సురేంద్ర, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌డి సమీర్, మదార్ షావల్లి, నాయబ్, లోకేష్, పండు, రఫీ, ఎంపిటిసి రహంతుల్లా, గుజిరి దర్బార్స్, నూర్రా, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సునీత

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

గర్భిణులు, బాలింతలతోపాటు ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సిడిపిఒ సునీత పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని బిడ్డాలమిట్ట అంగన్వాడీ కేంద్రంలో పోషణ పాఖ్వడా కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం పదార్థాలను మహిళలకు వివరించారు. బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత, పిల్లల్లో లోప పోషణ, పరిసరాల శుభ్రత, నీటి సంరక్షణ, పిల్లల్లో పెరుగుదల పర్యవేక్షణ వంటి వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆకుకూరలతో పాటు కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బెల్లం, ఖర్జూరం, రాగులు, జొన్నలు, మినుములు, పెసలు, పాలు, కోడిగుడ్లు వంటి ఆహార పదార్థాల ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకురాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చోరీకి గురైన ఆలయం

భూమాయపల్లె ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలో భూమాయపల్లె సమీపంలో కడప-కర్నూల్ జాతీయ రహదారి దగ్గర్లో భీమలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం చోరీ జరిగింది. ఆలయానికి సంబంధించిన హుండీని దుండుగులు ధ్వంసం చేసి, అందులో ఉన్న నగదును తీసుకెళ్లారు. హుండీలో పెద్ద మొత్తంలో నగదు ఉండవచ్చని స్థానిక ప్రజలు, భక్తులు భావిస్తున్నారు. ఆలయంలో సీసీ కెమెరా ఏర్పాటు కోసం దాతలు ఆర్థికసాయం చేసినా కెమెరాల ఏర్పాటు జరగలేదని భక్తులు చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ఆలయంలో చోరీ జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయని పలువురు పేర్కొం టున్నారు. ఆలయంలో చోరీలు ఎక్కువ అవుతుండడం పట్ల స్థానికులు, ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించాలని, రాత్రి సమయాల్లో గస్తీ పెంచి దొంగతనాలు అరికట్టాలని పలువురు కోరుతున్నారు.